

పొగమంచు చాటున సూరీడు

జిల్లాలో రోజురోజుకూ చలి పెరుగుతోంది. తెల్లవారుజాము నుంచే మంచు కమ్ముకుంటుండటంతో వణికిపోతున్నారు. బుధవారం ఉదయం మంచు తెరల నడుమ సూర్యుడు ఉదయిస్తుండగా సిద్దిపేట పట్టణ శివారులోని తాటివనాల సమీపంలో సుందర దృశ్యం కనిపించడంతో 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

చేర్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో కలకలం

- ఒంటిపై డీజిల్ పోసుకుని తండ్రి కొడుకు ఆత్మహత్యాయత్నం
- భూమి, ఆస్తి తగాదా విషయంలో వేధింపులే కారణం

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూమి, ఆస్తి తగాదా విషయంలో అక్రమంగా వేధింపులకు పాల్పడుతున్నారని చేర్యాలకు చెందిన అవుశర్ల సత్యనారాయణ, అతడి కుమారుడు అవుశర్ల వెంకటేశ్ బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. పట్టణానికి చెందిన అవుశర్ల సత్యనారాయణ అతడి సోదరుడి అవుశర్ల యాదయ్యల మధ్య వారసత్వ ఆస్తుల విషయంలో తగాదాలు చోటుచేసుకున్నాయి. ఈ విషయమై అవుశర్ల యాదయ్య తన వ్యవసాయ భూమి మీదికి వచ్చి దౌర్జన్యం చేశారని ఈనెల 11న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ నిమిత్తం సత్యనారాయణ, వెంకటేశ్‌ను స్టేషన్‌కు రప్పించారు. జోక్యం చేసుకోవద్దని పోలీసులు సూచించడంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ, వెంకటేశ్ ఠాణా ఆవరణలో ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సిబ్బంది అప్రమత్తమై అడ్డుకుని ఒంటిపై నీళ్లుపోసి సముదాయించారు. అనంతరం సత్యనారాయణ, వెంకటేశ్ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు పోలీసులు అక్రమంగా కేసులు బనాయింపజేశారని, ప్రస్తుతం ఒత్తిళ్లకు తలొగ్గి బైండోవర్ చేస్తామని వేధించడంతో పాలుపోక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డామని తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ నీరేశ్ మాట్లాడుతూ అవుశర్ల యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణ, వెంకటేశ్‌ను తొలిసారి ఠాణాకు పిలిచామని, తాము ఎలాంటి వేధింపులకు పాల్పడలేదన్నారు.



పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న సత్యనారాయణ, వెంకటేశ్



మై భారత్ నెహ్రూ యువ కేంద్రం, జిల్లా సమగ్ర శిక్షా సంయుక్త ఆధ్వర్యంలో సిద్దిపేట విపంచి కళానిలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా, జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం కొనసాగింది. అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి, సిద్దిపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి మాదక ద్రవ్యాలు, మద్యం, ధూమపానం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారితో 'సే నో టూ డ్రగ్స్' ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఈవోతో పాటు పోలీసులు, మై భారత్ నెహ్రూ యువ కేంద్ర జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్, పలు పాఠశాలల, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

- సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

అటు నోటీసులు.. ఇటు కబ్జాలు

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా నోటీసులు జారీచేస్తుండగా... మరోపక్క రియల్ మాఫియా ఎలాంటి జంకులేకుండా యథేచ్ఛగా కబ్జాలకు తెగబడుతున్నది. ప్రభుత్వ భూమిని కబ్జాచేసి వేసిన లేఅవుట్‌లోని రోడ్లను రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్ల సహాయంతో బుధవారం తొలగించారు. ఈ కబ్జా వ్యవహారం వెనక బడా ప్రజాప్రతినిధులు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. పట్టణంలోని వివాదాస్పద వాల నారాయణరావు ఇండస్ట్రీయల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో 1985లో చేసిన లేవుట్‌లోని భూములు క్రమంగా కబ్జాచేసి సొమ్ము చేసుకునేందుకు తెరవెనక గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. సదరు లేవుట్‌లో ప్రభుత్వ భూములు ఉన్నందున దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. వివాదాస్పద లేఅవుట్‌లో ఇటీవల రీడిజైన్‌తో అనుమతులు లేకుండానే ప్లాట్లు కొట్టి విక్రయించినట్లు తెలిసింది. అందులో 40 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఈ వ్యవహారంలో పక్కనే ఉన్న 997 సర్వే నంబరులోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి లేఅవుట్ వేయడం గమనార్హం. అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ లేఅవుట్‌ను తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. ప్రభు త్వ భూమిగా గుర్తించిన స్థలం చుట్టూ భారీ కందకాన్ని తవ్వి రోడ్లను తొలగించారు. వివాదాస్పద లేఅవుట్లలోని స్థలాలు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కస్టడీలో ఉన్నప్పటికీ ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

అమ్మో..వానరాలు

- కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న కోతులు
- వింత చేష్టలతో దాడులకు పాల్పడుతున్న వైనం
- ఇటీవలే చేర్యాలలో వానరం అడ్డురావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి
- తొగుటలో గాయపడ్డ మరో ఉపాధ్యాయుడు
- పంట నష్టానికి పాల్పడుతున్నాయని రైతుల ఆవేదన
- అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి..
- చోద్యం చూస్తున్న సంబంధిత ఉన్నతాధికారులు

సిద్దిపేట టౌన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గతంలో కోతులను సర్కస్‌లో లేదంటే జూ పార్కులో, జీవనోపాధి కోసం వానరాలను ఆడించే వారి దగ్గర చూసేవాళ్లం. ఎందుకంటే కోతులు ఎక్కువగా అడవుల్లోనే ఉండేవి. అరుదుగా బయట కనిపిస్తే వాటిని చూసి ఆనందపడుతూ ఆహారాన్ని అందించేవాళ్లం. కానీ ఇప్పుడు సీన్ మారింది. అడవుల్లో ఉండాల్సిన కోతులు వానరాలు సైన్యంగా మారి జనావాసాల్లో తిరుగుతున్నాయి. కోతుల వల్ల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణాలు గ్రామాలు అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా విస్తరించిపోయి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.



రైతులు ఆరబోసిన మక్క ధాన్యాన్ని తింటున్న కోతులు



రహదారిపై తిరుగుతున్న వానరాలు

ఇటీవలే ప్రమాదాలు

వానరాల వల్ల జిల్లాలో అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవలే జిల్లాలోని చేర్యాల మండలం వేచరేణికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా కోతి అడ్డురావడంతో తప్పించబోయి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతను మృతిచెందాడు. అదేరోజు తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలోని సయ్యద్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్‌పై వానరసైన్యం దాడి చేసింది. కోతుల వల్ల ఓ కుటుంబంలో విషాదం నిండగా, మరో కుటుంబంలో భయం

ఇళ్లల్లో చిందర వందరగా

వానరాల వల్ల జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి చొరబడి తినుబండారాల కోసం ఎగబడుతున్నాయి. ఈ క్రమంలో ఇళ్లలోని వస్తువులను, పప్పు దినుసులు, బియ్యం తదితర వాటిని చిందరవందరగా చేస్తున్నాయి. ఇళ్లలో పెంచుకుంటున్న కూరగాయలు, జామ, మామిడి, సపోట పండ్ల చెట్లను సైతం ఇష్టం వచ్చినట్లుగా పీకేస్తున్నాయి. ఇంటి యజమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పంటలకు తీవ్ర నష్టం..

వ్యవసాయ బావుల వద్ద ఆరుగాలం కష్టపడి పంట పండిస్తున్న రైతులకు కోతులు చెమటలు పట్టిస్తున్నాయి. మొక్కజొన్న, పల్లికాయ, బొబ్బర్లు, కందికాయ, టమాటాలు, బీరకాయ, ఆకుకూరలు, చిక్కుడుకాయలతో పాటు పచ్చిమిర్చి, బెండకాయ మినహ పలు కూరగాయలన్నీ తింటూ పీకేస్తున్నాయి. కోతుల భయానికి ఆయా పంటలు వేయాలంటేనే రైతులు వెనక్కి తగ్గుతున్నారు. పంట పండిస్తున్న చోట

మిగతా 8వ పేజీలో...

మెరుగైన సేవలందించాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో పల్వాన్‌కుమార్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

సిద్దిపేట టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖాన, పీహెచ్‌సీ సెంటర్లకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన సేవలందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వాన్‌కుమార్ సూచించారు. బుధవారం సిద్దిపేటలోని కాలకుంట్లకాలనీ బస్తీ దవాఖాన యూపీహెచ్‌సీ నాసర్‌పుర కేంద్రాలను డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వాన్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్యకేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఫార్మసీ స్టోర్, ల్యాబ్, వ్యాక్సిన్ భద్రపరిచే గదిలోకి వెళ్లి ఐఎల్‌ఆర్‌లో ఉన్న వ్యాక్సిన్ యొక్క శీతల స్థితిని, రికార్డులను పరిశీలించారు. అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాల్లో భాగంగా 30ఏళ్లు పైబడిన ప్రజలందరికీ పరీక్షలు నిర్వహించి, టీ హబ్‌కు నమూనాలను పంపించాలన్నారు. అవసరమున్న వారికి మందులు ఇవ్వాలని, పరిసరాల, వ్యక్తిగత శుభ్రతను పాటించే విధంగా ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే నిర్వహించాలని చెప్పారు.

వైద్యాధికారులతో సమీక్ష

జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యఅధికారులతో ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై డీఎంఅండ్‌హెచ్‌వో పల్వాన్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. అన్ని ఆరోగ్య కేంద్రాలలో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మెరుగు పరచుకోవాలని, వైద్యులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా

- మున్సిపల్ సిబ్బందితో తైబజారు వసూలు
- వేలం కన్నా అదనపు ఆదాయం
- కనీస వసతులు కల్పించాలని రైతులు, చిరువ్యాపారుల వేడుకోలు



8

రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ దొంగలే

- ఒకాయన ఢిల్లీలో ఉన్నడు.. మరొకరు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు
- ఎంపీ రఘునందన్‌రావు



7

విజ్ఞాన సర్వోదయం

- సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లో గ్రంథాలయం, స్టడీ సెంటర్
- దాతల సహకారంతో వసతులు
- గ్రామీణ యువతకు ఉపయోగం



7

నేటి నుంచి రామునిబండ జాతర

- ముస్తాబైన ఆలయం
- కార్తీక పౌర్ణమి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు

జగదేవ్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామసమీపంలోని సీతారాములోరి ఆలయం కార్తీకపౌర్ణమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా ఈ ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ గ్రామంలో బండపై సీతారాములవారు వెలియడంతో బండమీద జాతరగా పిలుచుకుంటారు. కార్తీక పౌర్ణమి నుంచి మూడురోజుల పాటు జాతర కొనసాగుతుంది. ఈ జాతరకు జగదేవ్‌పూర్, కొండపాక, సిద్దిపేట, ములుగు చేర్యాల, యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయం ముందున్న గుండంలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే సర్వరోగాలు నయమవుతాయని ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం. కొండపోచమ్మ ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే సీతారాముల ఆలయం ఉండడంతో అక్కడికి వచ్చే భక్తులు పౌర్ణమిరోజు తప్పకుండా సీతారాముల వారిని దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ అర్చకులు తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు జాతర ఉత్సవాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. పౌర్ణమి రోజు ప్రారంభమయ్యే బండమీద జాతర ఉత్సవాలకు సీతారాముల ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని గ్రామ మాజీ సర్పంచ్ కుమార్ తెలిపారు.



రామునిబండ ఆలయంలో కొలువుదీరిన సీతారామచంద్రస్వామి

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడిన చిన్నారి, మహిళ

చేగుంట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : పిచ్చికుక్క దాడిలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన చేగుంట మండల పరిధిలోని రాంపూర్, గొల్లపల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. రోడ్డుపై ధాన్యం ఆరబోసి కూర్చున్న రైతులతో పాటు విద్యార్థులపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. రాంపూర్ గ్రామానికి చెందిన కాశబోయిన నవనీత, గొల్లపల్లికి చెందిన చెంది బాబు, స్రవంతి, గొట్టం కృష్ణవేణితో పాటు పాఠశాల నుంచి గొల్లపల్లి తండాలోని ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు ప్రణవి, రేఖ, తండాలోని చిన్నారి నందినిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీసీ నిఘాలో పంటలు

- తోటలోని కూరగాయలు, వ్యవసాయ పరికరాలు చోరీకి గురికాకుండా ఏర్పాటు

అక్కన్నపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రజలు తాము నివసించే ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లు, దుకాణసముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏదైనా చోరీ జరిగితేనో లేదంటే నష్టం వాటిల్లినప్పుడు లబోదిబోమంటూ పోలీసుల వద్దకు పరుగులు పెడుతుంటారు. ఓ గిరిజన రైతు మాత్రం తన తోటల వద్ద, వ్యవసాయ బావుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

అక్కన్నపేట మండలం పంతులు తండాకు చెందిన రైతు బానోతు దుదియానాయక్ తనకున్న ఎనిమిది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పండ్ల తోటలు సాగుచేస్తున్నాడు. అలాగే వ్యవసాయ బావుల వద్ద పశువుల పాకలో ఎరువుల బస్తాలు, పెస్టిసైడ్స్, వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలను ఉంచుతాడు. అయితే రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు తోటలో చొరబడి పండ్లు, కూరగాయలు, పాకలో ఉన్న వస్తువులను అపహరించేవారు. అప్రమత్తమైన సదరు రైతు రూ.55 వేలు ఖర్చు చేసి ఎనిమిది సీసీ కెమెరాలను తన వ్యవసాయ క్షేత్రం చుట్టూ ఏర్పాటు చేశాడు. వ్యవసాయ బావి వద్ద కూడా ఓ సీసీ కెమెరాను ఏర్పాటు చేశాడు. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా... వాటిని తన సెల్ ఫోన్‌కు అనుసంధానం చేసుకున్నాడు. ఇక, ఆ సీసీ కెమెరాలు ద్వారా పొలం వద్దకు ఎవరు వచ్చారు.. ఏం పని జరుగుతుందో ఫోన్‌లోనే పరిశీలిస్తున్నాడు. తోటలు, పంటల వద్ద ఇలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఎవరూ చోరీలకు పాల్పడరని రైతు బానోతు దుదియానాయక్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పా టు చేసుకోవడం ద్వారా చోరీలను నియంత్రించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.



దుదియానాయక్, రైతు





పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకం


హోంగార్డుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ కీలకమని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న హోంగార్డులకు బుధవారం వీక్లీ పరేడ్, దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమని, సిబ్బంది, అధికారులు ప్రతిరోజు వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే ఎలాంటి విధులనైనా ధైర్యంగా నిర్వహించగలమని చెప్పారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ.. శారీరకంగా ఫిట్‌గా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వ్యక్తిగత లేదా డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డుగా కోమటికుంట

- వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువుల పారబోత
- తీవ్ర దుర్గంధంతో ప్రజల అవస్థలు
- మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకోలు


వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులతో డంపింగ్‌యార్డును తలపిస్తున్న కోమటికుంట

నర్సాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి అతి సమీపంలో ఉన్న కోమటికుంట మురికికూపంగా మారింది. ఆ కుంటలో చెత్తతో పాటు ప్లాస్టిక్, వ్యర్థాలు వేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తున్నది. దీంతో ప్రజలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్ పట్టణానికి నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన మార్గంలో రోడ్డుకు ఆనుకుని కోమటికుంట ఉంది. ఈ కుంట కింద గతంలో 50 ఎకరాలకు పైగా సాగయ్యేది. అయితే పట్టణం రోజురోజుకూ విస్తరించి కుంట పరిధిలో ఉన్న పొలాలన్నీ నేడు ఇళ్లతో కాలనీలుగా మారాయి. ఏదో కొంతమేరకు మాత్రమే ఈ కుంట పరిధిలోని భూముల్లో సాగు చేస్తున్నారు. పట్టణానికి దగ్గర ఉండటంతో పాటు ప్రధాన రోడ్డుకు అతి సమీపంలో ఉన్నందున ఈ కుంటను సుందరీకరణ చేసి గార్డెనింగ్‌తో పాటు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించి పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ కుంటలో మురుగునీరు, చెత్త, వ్యర్థాలు చేరి డంపింగ్‌యార్డును తలపిస్తున్నది. ఈ కుంట కట్టపై సమీప వ్యాపారస్తులతో పాటు ఇళ్ల వారు ఇష్టానుసారంగా వ్యర్థాలు పారస్తున్నారు. అలాగే సమీప ఇళ్లవారు మురుగునీటిని కుంటలోకే వదులుతున్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ అసంతృప్తి

ఈ మధ్యనే ప్రిన్సిపల్ సెక్రటరీ భారతిహోలికేరి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలో పర్యటించిన సందర్భంగా ఈ కుంట కట్టను సందర్శించారు. ఈ సందర్భంగా కట్ట వద్ద పెద్దఎత్తున ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా వెంటనే తొలగించి శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు అప్పటివరకు వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారే తప్ప పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టలేదు. దీంతో ఒకటి, రెండురోజుల తర్వాత మళ్లీ కుంట పరిసర ప్రాంతాల్లో చెత్తను పారబోస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని కుంటలోకి మురుగునీరు వదలకుండా చూడడంతో పాటు చెత్త, వ్యర్థాలను వేయకుండా చూసి, పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- జిల్లాలో పరీక్షలు రాయనున్న 15,123 మంది అభ్యర్థులు
- జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి


కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రీజనల్ కో ఆర్డినేటర్లు, స్ట్రాంగ్‌రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్, వివిధశాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రూప్-3 పరీక్షలు రాసేందుకు 15,123 అభ్యర్థులు హాజరుకానున్నారని, జిల్లావ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. పరీక్షలు రాసే అభ్యర్థులు నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్, ఏదేని గుర్తింపు కార్డుని తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని తెలిపారు. ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ముందే బయలుదేరాలన్నారు. అలస్యంగా వచ్చి బాధపడేకన్నా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకుని పరీక్షల్లో విజయం సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ప్రొఫైల్‌కు అడుగులు

- సంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా షురూ
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నుంచి రోగుల రక్త నమూనాలు
- ఫలితాల ఆధారంగా చికిత్స, వివరాలు నిక్షిప్తం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ హెల్త్ కార్డు రూపకల్పనలో భాగంగా ప్రతి ఒక్కరి ఆరోగ్య సమాచారం(హెల్త్ ప్రొఫైల్) నమోదుకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిఒక్కరి ఆరోగ్య సమాచారం ముందే తెలిసేలా హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా(పైలెట్)జిల్లాలో అమలుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం సుమారు 15 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. రెండురోజుల క్రితం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించారు. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనలో భాగంగా ఆయా ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేషెంట్ల వివరాలు డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా నమోదు చేయించి సంబంధిత మెడికల్ ఆఫీసర్ వద్దకు పంపిస్తున్నారు. సదరు డాక్టర్ పరీక్షించి వివిధ రక్త నమూనా పరీక్షల నిమిత్తం సిఫారసు చేస్తున్నారు. పేషెంట్ల నుంచి సేకరించిన రక్త నమూనాలకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని టీ-డయాగ్నోస్టిక్ హబ్‌కు పంపి వ్యాధి నిర్ధారణ చేయిస్తున్నారు. మరుసటి రోజు వచ్చిన ఫలితాల ఆధారంగా వైద్య సేవలు, మందులు అందించడంతో పాటు సదరు రోగుల వివరాలు సంబంధిత ప్రొఫార్మాలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇందుకోసం టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ రకంగా జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల నుంచి నిత్యం సుమారు 250 నుంచి 300 వరకు రోగుల వివరాలను హెల్త్ ప్రొఫైల్‌లో నిక్షిప్తం చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. కాగా హెల్త్ ప్రొఫైల్‌కు సంబంధించి ఆ శాఖ గోప్యత పాటిస్తున్నది.


కొత్లాపూర్‌లో నీటిలో మునిగిపోయిన డంపింగ్‌యార్డు

నీటిలో పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు!

సంగారెడ్డి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పోచమ్మకుంటలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డును నిర్మించింది. రెండునెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు అవి పూర్తిగా మునిగాయి. ఇప్పటికైనా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి పోచమ్మ కుంటలోని నీటిని తొలగించాలని కోరుతున్నారు.



నీటిలో ఉన్న పల్లె ప్రకృతివనం

కన్వేయర్ బెల్టు తగిలి కార్మికుడి మృతి


జిన్నుగౌడ మృతదేహం

మనోహరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్క్రాప్ డివైడ్ కన్వేయర్ బెల్ట్ తగిలి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన రంగాయపల్లి స్టీల్ పరిశ్రమలో చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి వచ్చి అద్దెకు ఉంటూ ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పని నిమిత్తం ముగ్గురూ వెళ్లారు. పనిచేస్తుండగా స్క్రాప్ డివైడ్ కన్వేయర్ బెల్ట్ తగిలి జిన్నుగౌడ(26)కు తీవ్రగాయాలయ్యాయి. పరిశ్రమ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి అన్న మిట్టు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి పాల్పడిన ఇద్దరికి మూడేళ్ల జైలు

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన ఇద్దరి నేరస్తులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గజ్వేల్ అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక తీర్పు చెప్పినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, కొడకండ్ల, కుకునూరుపల్లి గ్రామాల్లో రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం చందర్‌నాయక్‌తండాకు చెందిన రాథోడ్ అలియాస్ జాదవ్‌నగేష్(34), జాదవ్ బలరాం(45) దొంగతనాలకు పాల్పడ్డారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు తీర్పు వెలువరించారని ఎస్ఐ వివరించారు.

ఉచితంగా మందుల పంపిణీ

శివ్వంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధుమేహం దీర్ఘకాలికంగా ఉండేదని, ఆరోగ్య ఆహార సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఇలైట్ 302బి జోన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జాతీయ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని మగ్దుంపూర్‌లో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 100 మంది మధుమేహం పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



పవన్ కళ్యాణ్(ఫైల్)

హవేళీఘణపూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హవేళీఘణపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మూగ పవన్‌కళ్యాణ్(24) తండ్రి నర్సింహులు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి తనకున్న వ్యవసాయంతో పాటు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబం గడవడమే కష్టంగా ఉందని, ఇక చెల్లి వివాహం చేసేది ఎలా అని తరచూ తల్లితో చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పొలం వద్ద పురుగులమందు తాగి తన తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతడిని వెంటనే మెదక్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు

టవర్‌లో బ్యాటరీలు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

శివ్వంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టవర్‌కు సంబంధించిన 24 బ్యాటరీలను దుండగులు అపహరించకపోయిన సంఘటన చిన్న గొట్టిముక్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో ఎయిర్ టెల్ టవర్ దగ్గర నుంచి మంగళవారం రాత్రి బ్యాటరీలను చోరీ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎయిర్ టెల్ విజిలెన్స్ టీం, సిబ్బంది బాలమురళీ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి




తిరుపతిరెడ్డి (ఫైల్)

గజ్వేల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బైక్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్గూరు గ్రామంలో చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన పబ్బతి తిరుపతిరెడ్డి(38) వ్యవసాయం చేసుకుంటూ కటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం గజ్వేల్‌లో పని నిమిత్తం బయలుదేరగా మార్గమధ్యలో కొల్గూరు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొట్టింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజ్ఞాన సర్వోదయం

- సర్వోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లో గ్రంథాలయం, స్టడీ సెంటర్
- దాతల సహకారంతో సకల వసతులు
- అందుబాటులో పోటీపరీక్షల మెటీరియల్
- గ్రామీణ యువతకు ఎంతో ఉపయోగం

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సిర్గాపూర్‌లో ఏర్పాటు చేసిన సర్వోదయ గ్రంథాలయం, స్టడీ సెంటర్

కల్హేర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నిరుపేద నిరుద్యోగుల సౌకర్యార్థం ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో గ్రంథాలయం, స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నది సర్వోదయ గ్రామ సేవా ఫౌండేషన్. గ్రామీణ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి స్టడీ సెంటర్, మెటీరియల్‌తో పాటు, దినపత్రికలు, ఇతర పుస్తకాలను అందుబాటులో ఉంచుతూ వారి పాలిట విజ్ఞాన సర్వోదయంగా మారుతున్నది. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి సుధాకర్‌నాయక్ సిర్గాపూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం, స్టడీసెంటర్ ప్రస్తుతం ఎంతోమంది యువతకు ఉపయోగపడుతున్నది.

అన్నీ వసతులతో..

అధికశాతం గిరిజనులు, పేదలు ఉన్న సిర్గాపూర్ ప్రాంతంలో ఎంతో ప్రతిభ కలిగిన యువత పోటీపరీక్షలకు సిద్ధం కావాలని ఆసక్తి ఉన్నా, తగిన సౌకర్యాలు, పుస్తకాలు కొనుగోలు చేసే స్థోమత లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పోటీ పరీక్షలకు దూరంగా ఉంటున్నారు. దీన్ని గమనించిన సిర్గాపూర్ తాజా మాజీ సర్పంచ్ జంగం స్వప్న ఈ విషయాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని సిర్గాపూర్‌లో సర్వోదయ గ్రామ సేవా ఫౌండేషన్ సంస్థతో స్టడీసెంటర్, గ్రంథాలయం ఏర్పాటు చేయించారు. సెంటర్ భవనాన్ని గ్రామపంచాయతీ సమకూర్చగా, అందులోకి అల్మారాలు, స్టడీ టేబుళ్లు, కుర్చీలు, అన్నిరకాల పోటీ పరీక్షల మెటీరియల్ తదితర వసతులను సర్వోదయ ఫౌండేషన్ సమకూర్చింది. స్టడీ సెంటర్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి చేతులమీదుగా గత జనవరి 31న ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. దీన్ని నిర్వహణను దాతలు, గ్రామ పంచాయతీ సహకారంతో చేపడుతున్నారు.

అందుబాటులోకి వైఫై..

దినపత్రికలు, తాగునీరు, ఇతర అవసరాలు మాజీ సర్పంచ్ స్వప్న సమకూర్చుతుండగా, మరో మాజీ సర్పంచ్ వైజయంతీ శ్రీనివాస రావ్ ఇటీవల వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. మారుమూల ప్రాంతంలో ఎంతో ముందు చూపుతో స్టడీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్ సంగం స్వప్నశంకరయ్య, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సిర్గాపూర్ గ్రామస్థులకు యువకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మరన్ని పస్తకాలు సమకూర్చేందుకు దాతలు ముందుకురావాలని కోరుతున్నారు

యువకుల బాధలు చూసి..



పేదరికం కారణంగా చాలా మంది గ్రామ యువకులు పోటీ పరీక్షలకు దూరంగా ఉంటూ బాధపడుతుండేవారు. దీన్ని చూసి వారి కోసం ఏదైనా చేయాలనే తపనతో గ్రంథాలయ ఏర్పాటు విషయమై నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లా. ఆయన వెంటనే స్పందించి సర్వోదయ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయించారు.

-స్వప్న, మాజీ సర్పంచ్, సిర్గాపూర్

ఆనందంగా ఉంది..



సిర్గాపూర్‌లోని స్టడీ సెంటర్, గ్రంథాలయంతో నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతున్నది. రుపాయి ఖర్చు లేకుండా సకల సౌకర్యాల మధ్య పోటీ పరీక్షలకు సిద్ధమవడం ఆనందంగా ఉంది. దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. దాతలు ముందుకువచ్చి మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తేవాలి.

-గురునాథ్, లక్ష్మణ్‌నాయక్‌తండా, కడ్పల్



స్టడీ సెంటర్‌లో చదువుకుంటున్న యువకులు

వారోత్సవాలను విజయవంతం చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 20 వరకు నిర్వహించే 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి తెలిపారు. సిద్దిపేట గ్రంథాలయంలోని కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 14న చిత్రలేఖనం, 15న పుస్తక ప్రదర్శన, 16న సుడోకు క్విజ్, 17న కవి సమ్మేళనం, 18న వ్యాసరచన, 19న మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు, 20న ముగింపు సమావేశం, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ వారోత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారి పేర్లు గ్రంథాలయ అధికారికి ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.సుధీర్, తప్పెట శంకర్, కేదారి మధు, గౌసుద్దీన్, నజ్మా తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ దొంగలే

- ఒకాయన ఢిల్లీలో ఉన్నాడు.. మరొకరు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు
- లగచర్ల వివాదం, మల్లన్నసాగర్ పోరాటం రెండింటిది ఒకే తీరు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్/హవేళీఘణపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ దొంగలేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఘాటు విమర్శలు చేశారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం తొగిటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతుకు ఆ పంటను అమ్ముకునేందుకు దిక్కుతోచడం లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వమే కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు చెల్లిస్తుందని వివరించారు. సన్నాలను కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు చెల్లిస్తుందని వివరించారు. సన్నాలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తూ అనేక ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. మద్దూరు పీఏసీఎస్ సొసైటీ నిర్వాహకులు రైతులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోవాలని డైరెక్టర్లు సూచిస్తున్నట్లు రైతులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ సొసైటీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ కమిషనర్ ఏం మాట్లాడుతున్నాడో.. ఆ శాఖలో ఏం జరుగుతుందో సీఎం రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ఎస్ ఢిల్లీలో ఉన్నాడని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడన్నారు. వీరిద్దరూ తోడు దొంగలేనని వ్యాఖ్యానించారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కలెక్టర్‌పై దాడి బాధాకరమన్నారు. ఈ ఘటనలో రాజకీయ ప్రమేయం ఉన్నదని ఆరోపించడం సరికాదని అన్నారు. కలెక్టర్‌పై దాడి జరిగిన అనంతరం రెండురోజులుగా ఆ పరిసర మూడుతండాల్లో మనుషులు కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మల్లన్నసాగర్ కట్టినపుడు కేసీఆర్, హరీశ్‌రావు రైతులను ఎత్తుకెళ్లగా, ప్రస్తుతం అదే తరహాలో లగచర్లలో జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాలు వేరుగా అనిపించడం లేదని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

భారీగా గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు.. 10 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



తూప్రాన్‌లో పట్టుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న పోలీసులు

తూప్రాన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసి వారి నుంచి 10 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం తూప్రాన్ పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం జీడిపల్లి వద్ద గంజాయి అమ్ముతున్నట్లు మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌కు బుధవారం ఉదయం సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో కలిసి వెళ్లగా జాతీయ రహదారి 44పై ఉన్న అండర్ పాస్ వద్ద ఓ వ్యక్తి వీరిని చూసి గంజాయి ప్యాకెట్‌ను చెట్లపొదల్లోకి విసిరాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఐటీసీ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేసే బీహార్ రాష్ట్రానికి చెందిన రంజన్ కుమార్(30)గా తేలింది. పొదల్లో వేసిన కవర్ తెరిచి చూడగా కిలో గంజాయి లభించింది. ముప్పిరెడ్డిపల్లిలో ఉంటున్న ఒడిశాకు చెందిన శ్రీధర్‌సాహు వద్ద కొనుగోలు చేసినట్లు రంజన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు అతడి నివాసంలో తనిఖీలు చేయగా 9 కిలోల 300 గ్రాముల గంజాయి లభించింది. వీరిద్దరిని అరెస్టు చేసి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ రంగకృష్ణ, మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు



పట్టుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న నలుగురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సాకు చెందిన ఇద్దరు మహిళలు ఎర్మెనునమ్ (33), పునీం (33), ఇద్దరు వ్యక్తులు మడ్కాన్ లచ్చా (27), టోకిర్‌హబీబ్ (28) ఒరిస్సా సరిహద్దు నుంచి గంజాయిని పలు మార్గాల్లో పటాన్‌చెరుకు తరలించారు. అనంతరం మండల పరిధిలోని ఘనాపూర్, పటాన్‌చెరు పట్టణ శివారులోని వ్యాల్యూజోన్ హైపర్ మార్కెట్ వద్ద విక్రేతల కోసం వారు ఎదురు చూస్తున్నారు. దీనిపై విస్వసనీయం సమాచారం అందుకున్న సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం ఉదయం దాడులు నిర్వహించి వారి నుంచి ఆరున్నర కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 3లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ప్రధానోపాధ్యాయురాలిని తొలగించాలి

●ఎంఈవోకు గ్రామస్థుల ఫిర్యాదు



ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కంగ్టి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న దెగుల్‌వాడి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం రేఖారాణి ఒక్క రోజు కూడా ప్రార్థనా సమయానికి వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఆమెను నిలదీసినా, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. నిత్యం హైదరాబాద్ నుంచి రాకపోకలు కొనసాగిస్తుండడంతో పాఠశాలకు మధ్యాహ్నం చేరుకుంటుందన్నారు. తక్షణమే ఆమెను ఇక్కడి నుంచి తొలగించాలన్నారు. ఈ విషయమై హెచ్‌ఎంను సంప్రదించగా తాను నిత్యం కారులో పాఠశాలకు వస్తానని, ఎప్పుడైనా బస్సుకు వచ్చినపుడు మాత్రమే కాస్త ఆలస్యమవుతుందని వివరించారు. కొందరు కావాలనే ఇదంతా చేస్తున్నారని చెప్పారు.



తనిఖీలు చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు.

రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పెద్దశంకరంపేట, నవంబరు 13.(ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూర్ వద్ద ఉన్న సప్తగిరి రైస్‌మిల్లును బుధవారం సాయంత్రం రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. వీరోజ్ పల్లి తండాకు చెందిన ఓ వ్యక్తి మిల్లు నిర్వాహకులు ధాన్యం సకాలంలో తీసుకోవడం లేదని, అదనంగా బస్తాకు నాలుగు కిలోలు తూకం వేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్లులో విచారణ చేపట్టారు. వీరోజ్ పల్లితో పాటు పరిసర గ్రామాలలోని రైతులను విచారించారు. మిల్లులో వరి ధాన్యం తీసుకుంటున్నారా..? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని తేమ లేకుండా తీసుకురావాలని మిల్లు వ్యాపారులకు సూచిస్తున్నారని, కొంత ధాన్యం తేమ ఉన్నా తీసుకుంటున్నారని రైతులు అధికారులకు తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తికి అసలు భూమేలేదని నకిలీ ఫిర్యాదు చేశారని గుర్తించిన అధికారులు అతని పై కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్‌ఐ శంకర్‌కు విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీలో అడిషనల్ ఎస్పీలు ద్రోణాచార్యులు, శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రింగ్‌రోడ్డుపై క్వాలీస్ పల్టీ

●ఆరుగురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు, నవంబరు, 13 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ శివారులోని సుల్తాన్‌పూర్ గ్రామ పరిధిలో నెహ్రూ ఔటర్‌రింగ్ రోడ్డుపై క్వాలీస్ వాహనం పల్టీలు కొట్టిన సంఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి మండలం దోబీపేట్ గ్రామానికి చెందిన చరణ్, వివేక్, మహేందర్, చింటు, బబ్లూ, సతీష్ మంగళవారం రాత్రి మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. తిరిగి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ముత్తంగి జంక్షన్ వద్ద స్వీట్‌హార్ట్ హోటల్‌లో టీ తాగారు. అనంతరం అక్కడి నుంచి యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ఔటర్‌రింగ్ రోడ్డుపై నుంచి బయలుదేరారు. కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల మధ్యకు రాగానే అతివేగంలో ఉన్న వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీ కొట్టడంతో అందులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని పటాన్‌చెరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్స్‌లో క్షతగాత్రులు

మహిళ కడుపులోని 9.5కిలోల కణితి తొలగింపు



సిద్దిపేట టౌన్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): అరుదైన శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులో నుంచి 9.5 కిలోల కణితి (గడ్డ) తొలగించినట్లు సిద్దిపేట పట్టణంలోని లోహిత్ సాయి ఆసుపత్రి ఛైర్మన్, డాక్టర్ ఏ. భాస్కర్ తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ చేర్యాల గ్రామానికి చెందికి ఓ మహిళ కడుపు నొప్పి, ఉబ్బుతుందని 4 రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. దీంతో వైద్యులు స్కాన్ చేసి కడుపులో కణితి (గడ్డ) ఉందని గుర్తించి సర్జరీ ద్వారా తొలగించినట్లు తెలిపారు.

పెద్దలకు ఉచితం.. పేదలకు భారం..

- నర్సాపూర్‌వాసులపై గుమ్మడిదల టోల్ గేట్ సిబ్బంది పక్షపాత ధోరణి
- నాయకులైతే నో టోల్.. సామాన్యులైతే చెల్లించాల్సిందే..
- 15 కిలోమీటర్ల దూరం కూడా లేని గ్రామానికి టోల్ తగునా?

నర్సాపూర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ 765డి జాతీయ రహదారిగా విస్తరించాక సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల సమీపంలో ఏర్పాటు చేసిన టోల్ గేట నర్సాపూర్ పట్టణవాసులకు శాపంగా మారింది. నిబంధనల ప్రకారం 20కిలోమీటర్ల లోపు ఉన్న గ్రామాలకు టోల్ వసూలు చేయకూడదు. నర్సాపూర్ నుంచి టోల్‌గేటు వరకు 15 కిలోమీటర్ల దూరం కూడా లేదని అయినా పట్టించుకోకుండా నర్సాపూర్ వాసుల నుంచి టోల్ వసులు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నర్సాపూర్‌కు చెందిన ప్రముఖులు, నాయకులు, రాజకీయ పలుకుబడి ఉన్న వారిని ఉచితంగా పంపిస్తున్నారని, సామాన్యుల నుంచి మాత్రం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెద్దలకు వర్తించిన నిబంధనలు పేదలకు వర్తించవా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామస్థులందరికీ టోల్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.



గుమ్మడిదల వద్ద జాతీయ రహదారిపై టోల్ గేటు

గంజాయి పట్టివేత

కోహెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంచల్‌చెరువుపల్లి (సీసీపల్లి)లో హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్‌ఐ రూప ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి నారోజు గణేష‌చారి ఇంట్లో తనిఖీ చేసి 830 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు చెప్పారు. అతడిని అదుపులోకి తీసుకుని, హుస్నాబాద్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి సిద్దిపేటలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 15 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి 15 మందికి రూ.24000 జరిమానా, వారిలో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష విధించారు.

కానిస్టేబుల్ మృతి పట్ల సంతాపం

సిద్దిపేట క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంనగర్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ (రైటర్) నవీన్ మృతి పట్ల ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

'బస్సు సౌకర్యం కల్పించండి'

గజ్వేల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని బెజుగామ, చిన్నారెపల్లి, బయ్యారం గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌కి బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజ్ఞాపూర్ ఫీడర్ పరిధిలోని అహ్మదీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అహ్మదీపూర్, పిడిచెడ్, కొల్గూరు, శేరిపల్లి, దిలాల్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్ శాఖఏఈ సత్యం తెలిపారు.

ఆదాయం ఉన్నా.. వసతులు సున్నా

- మున్సిపల్ సిబ్బందితో తైబజార్ వసూలు
- వేలం కన్నా అదనపు ఆదాయం
- కనీస వసతులు కల్పించాలని రైతులు, చిరువ్యాపారుల వేడుకోలు



వారాంతపు సంత (ఫైల్)

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారాంతపు సంత మున్సిపాలిటీకి ఆదాయ వనరుగా నిలుస్తున్నది. సంతలో కూరగాయలు, పండ్లు, దుస్తులు, ఇతరత్రా వస్తుసామగ్రి విక్రయంకోసం పొరుగు ప్రాంతాల నుంచి రైతులు, చిరువ్యాపారులు తరలివస్తూ ఉపాధి పొందుతున్నారు. ఒకే దగ్గర అన్ని రకాల వస్తువులు లభించడంతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతున్నది. పలు గ్రామాల్లో ఇతర రోజుల్లో సంతలు కొనసాగుతున్నప్పటికీ పట్టణంలోని మంగళవారం సంతకు ప్రజలు భారీగా తరలివస్తుంటారు. దీంతో పట్టణంలో సిద్దిపేట-జనగామ జాతీయరహదారి, అంగడిబజారు కొనుగోళ్లతో రద్దీగా ఉంటుంది.


వర్షంలోనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు (ఫైల్)

మున్సిపాలిటీకి ఆదాయం

సంతలో పారిశుధ్య నిర్వహణ చర్యలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నందున తైబజారు పేరిట వేలం పాటలు నిర్వహిస్తుంటడంతో కొంతమేర ఆదాయం వస్తున్నది. గతేడాది వేలంపాటలు చేపట్టడంతో సుమారు రూ.4.30లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది వేలానికి చర్యలు తీసుకున్నప్పటికీ కాంట్రాక్టర్లు ఆసక్తి కనబరచక రూ.2లక్షల లోపు టెండర్ ఇవ్వాలని కోరారు. కానీ మున్సిపాల్ అధికారులు అంగీకరించక వేలం నిలిపివేసి సిబ్బందితో తైబజారు వసూలు చేయిస్తున్నారు. దీంతో గత ఎప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.3లక్షలకు పైగా ఆదాయం సమకూరగా, ఆర్థికసంవత్సరానికి మరో ఆరు నెలల సమయం మిగిలి ఉన్నందున మరింత ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

వేలంతో వచ్చేది తక్కువే

వేలంపాటల కన్నా స్వతహాగా నిర్వహిస్తే మున్సిపాలిటీకి రెండింతలు ఆదాయం వస్తుండడంతో సిబ్బందితో తైబజారు వసూలు కొనసాగింపచేస్తామని పేర్కొంటున్నారు.

కనీసవసతులూ కరువే

కూరగాయలు, పండ్లు, దుస్తులు, ఇతరత్రా వస్తువుల విక్రయానికి సంబంధించి నిరేశిత రుసుం పేరిట తైబజారు డబ్బులు చెల్లిస్తున్నా, మున్సిపల్ అధికారులు కనీసవసతులు కల్పించకపోవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాకాలంలో వారి గోస వర్ణనాతీతం. గతంలో ప్రధాన రహదారిని ఆనుకుని కొనసాగే సంత నానాటికీ వీధుల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ వసతితో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటుచేయాలని వేడుకుంటున్నారు.

తంగళ్లపల్లి కస్తూర్బా పాఠశాలకు రూ. 40 లక్షలు మంజూరు

కోహెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగళ్లపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలకు రూ. 40 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. బుధవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టులో ఆయన కేజీబీవీని సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులకు పంపాలని ఆదేశించారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకి కృషి చేశారు. పాఠశాలలో డార్మెంటరీ, తాగునీరు కోసం ఈ నిధులు వెచ్చించనున్నారు. పనులు అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు బి సంపత్, నారాయణ గౌడ్, పాము శ్రీకాంత్, కత్తి నరసయ్య అబ్దుల్ రఫీ, రాజమౌళి, సత్యనారాయణలు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలి

- ఎంపీడీవో యాదగిరి

జగదేవ్‌పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీవో యాదగిరి సూచించారు. జగదేవ్‌పూర్‌తో పాటు మునిగడప, తిగుల్‌లో చేపట్టిన సర్వేను బుధవారం ఎంపీడీవో యాదగిరి, మండల పంచాయతీ అధికారి ఎండీ. ఖాజామోహినొద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారంలో ఇచ్చిన అన్ని కాలాలను తప్పులు లేకుండా నింపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామ్‌రెడ్డి, హరీష్‌కుమార్, నరేందర్, ఉపాధిహామీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్, ఎన్యూమరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను గుర్తించాలని ఎంపీడీవో యాదగిరి సూచించారు. మండలంలోని తిగుల్‌లో నిర్వహించిన 2024-25 ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను గుర్తించి రైతుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఉపాధిహామీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో

అధికారులపై దాడి సరికాదు

- మేజర్ టెంపుల్ జేఏసీ కో చైర్మన్ చంద్రశేఖర్

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడి హేయమైన చర్యని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ మేజర్ టెంపుల్ జేఏసీ కో- చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ అన్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులపై దాడి సబబుకాదన్నారు. సమావేశంలో మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, జూనియర్ అసిస్టెంట్ నర్సిహులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడిని ఖండిస్తూ చేర్యాల తహసీల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సమీర్‌అహ్మద్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో ట్రాకింగ్ కెమెరాలు, బోను ఏర్పాటు

సిద్దిపేట అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామ శివారులో చిరుత కలకలం సంఘటనలో బుధవారం మరోసారి ఫారెస్ట్ అధికారులు పోలీసుల సహకారంతో గ్రామ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. బూరుగుపల్లి గ్రామ శివారులోని పులి సంచరించింది అనే అనుమానం ఉన్న ప్రదేశంలో ట్రాకింగ్ కెమెరాలు, పులి బోనును ఏర్పాటు చేశారు. ఈ విషయంపై సిద్దిపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి విక్రముద్దీన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బూరుగుపల్లి శివారులో కొన్ని పాదముద్రలు గుర్తించినా అవి చిరుత పాద ముద్రలేనని ధ్రువీకరించలేకపోతున్నామన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


మార్కెట్‌యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, సిద్దిపేట జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, భూసార పరీక్షా కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో రూ.82.20కోట్ల వ్యయంతో నిర్మించిన భూసార పరీక్షా కేంద్రం వృథాగా ఉండిపోయిందన్నారు. వారివెంట నాయకులు పంజా బాలు, ఉప్పల మధు, పెండ్యాల శ్రీనివాస్, విజయ్, నాయిని సందీప్, బారు అరవింద్, పంజాల వెంకట్‌గౌడ్, దువ్వల రాజు, నవీన్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

ఐడీ కార్డులు విధిగా ధరించాలి

- నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంరెడ్డి

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఐడీకార్డులు విధిగా ధరించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీరాంరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబసర్వే నిర్వహణలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు చిత్తశుద్ధితో పాటుపడాలని, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర ప్రముఖ రాజకీయ నాయకుల గృహాలను తప్పకుండా సందర్శించి సర్వే చేపట్టాలని తెలిపారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి నాగరాజు, తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, మున్సిపల్ కమిషనర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం'

ములుగు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గురువారెడ్డి ఆరోపించారు. మండలంలోని వంటిమామిడిలో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకున్న ఘనత బీజేపీకే దక్కిందన్నారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, కొండ నర్సింహులు, బాబు, మహేష‌గౌడ్, రమేష్‌యాదవ్, యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

గజ్వేల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొలువైన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 416వ జయంతిని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, కలశారాధన, వీరబ్రహ్మేంద్రస్వామికి షోడష ఉపచారపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో సమాజ పరిస్థితులను, జరుగబోయే సంఘటనలను కాలజ్ఞానం ద్వారా వివరించడంతో పాటు సమాజంలోని కులమత బేధాలను నిర్మూలించడంలో వీరబ్రహ్మేంద్రస్వామి ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీకి విద్యార్థులను సిద్ధం చేయాలి: ఎంఈవో సత్తయ్య


హనుమాన్‌నగర్ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈవో

కుకునూరుపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో నిర్వహించే నేషనల్ సర్వే పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈవో సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మాత్‌పల్లి, కుకునూరుపల్లి, హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన నమూనా పరీక్ష పేపర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

హుస్నాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేయాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌కు వాజ్‌పేయి అభిమాన సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రధాన చౌరస్తాలు సుందరీకరణ చేస్తున్న నేపథ్యంలో ఏదైనా చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బత్తుల శంకర్‌బాబు, గాదాసు రాంప్రసాద్, వరియోగుల అనంతస్వామి, పోలోజు రాజేందర్ చారి, శ్రీనివాస్, రమణ తదితరులున్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించరూ


మద్దూరులో రోడ్డుకు ఇరువైపులా కోనోకార్పస్ చెట్లు

మద్దూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే మాటేమోగాని కోనోకార్పస్ చెట్లు మాత్రం శ్వాసకోశ, అస్తమా లాంటి అనారోగ్య కారకాలుగా తెలుస్తున్నది. మండలంలోని పలు గ్రామాల్లో హరితహారంలో గ్రామపంచాయతీ నిధులు వెచ్చించి ప్రమాదకర కోనోకార్పస్ మొక్కల్ని రోడ్డుకు ఇరువైపులా నాటి అధికారులు టార్గెట్ పూర్తయిందనిపించుకున్నారు. వాటి నిజ స్వరూపం తెలుసుకునే నాటికి అవి వృక్షాలుగా మారాయి. వాటి కారణంగా శ్వాసకోశ, అస్తమా లాంటి దీర్ఘకాలిక అనేక రోగాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నా వాటి తొలగింపుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలున్నాయి.

'ప్రశ్నించే గొంతుకనవుతా'

గజ్వేల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల పక్షాన ప్రశ్నించే గొంతుకను అవుతానని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రులఎమ్మెల్సీగా బరిలో నిలువనున్నట్లు తెలిపారు.ఆయా శాఖల ఉద్యోగులు పట్టభద్రులను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గతంలో తాను కరీంనగర్ మేయర్‌గా పనిచేశానని, కరీంనగర్ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించాలనని పేర్కొన్నారు.

నాచగిరిలో కార్తీక శోభ

దీపాలు వెలిగించిన మహిళలు


కార్తీక మాస విశిష్టతను మహిళలకు వివరిస్తున్న ఆలయ అర్చకులు

వర్గల్, నవంబరు 13: మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం కార్తీక మాసం సందర్భంగా బుధవారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పర్యవేక్షణలో నిత్య కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా 12వ రోజు బుధవారం మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలగించారు. ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు పర్యవేక్షణలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

దుబ్బాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలోని ధర్మాజీపేట వార్డులోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తహీనత పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ ఇంద్రమోహన్ తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

హుస్నాబాద్‌లో ఏబీవీపీ ధర్నా

హుస్నాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాసర ఐఐఐటీలో ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి రహదారిపై ఆ సంఘం నాయకులు ధర్నా చేశారు. ఇందులో ఏబీవీపీ నగర కార్యదర్శి కాంసాని రాకేష్, రాహుల్ తదితరులున్నారు.

'నా భూమి నాకు ఇప్పించండి'

- తహసీల్దార్‌కు వృద్ధుడి వినతి

కోహెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన భూమి తనకు ఇప్పించాలని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌కు చెందిన మెరుగు చంద్రయ్య(70)అనే వృద్ధుడు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చాడు. వృద్ధుడు తెలపిన వివరాల ప్రకారం.. తన భార్య ఏడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోయిందని, పిల్లలు కూడా లేదన్నారు. తన సోదరుడు మెరుగు బాలయ్య కోహెడలో నివాసం ఉంటున్నాడని, తనకు కోహెడ గ్రామ శివారులో ఎకరం 30 గుంటల భూమి ఉందన్నారు. అన్న కుమారుడు మెరుగు రాజయ్య తనను జీవితాంతం చూసుకుంటానని ఇంటికి తీసుకెళ్లాడని, ట్రాక్టర్ కొనుగోలు చేస్తున్నానని, లోన్ కోసం సాక్షిగా నీ సంతకం అవసరమని చెప్పి తన భూమిని కొనుగోలు చేసినట్లు సంతకం పెట్టించుకున్నట్లు వాపోయాడు. రైతుబంధు డబ్బులు పడకపోవడంతో తన అల్లుడు ఉల్లి చంద్రమౌళి దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ విషయం తెలిసినట్లు వాపోయాడు.

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమర వీరుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ శాస్త్రీయ విద్యాసాధన కోసం అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు సంపత్‌కుమార్, అనిల్, అంజి, రమేశ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పంటలతో భారీ దిగుబడులు


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కుకునూరుపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పంటలతో భారీ దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు అన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో కుకునూరుపల్లి సాగుచేస్తున్న పత్తిపంటను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పద్ధతి ద్వారా పంట త్వరగా చేతికి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, ఏవో గోవింద రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలను కట్టడి చేయొచ్చని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సీసీ కెమెరాలతో అపరిచిత వ్యక్తులను గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


దుబ్బాకలో విద్యార్థులను అభినందిస్తున్న సీఐ శ్రీనివాస్

- తొగుట: సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండలంలోని తుక్కాపూర్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేరరహిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికాంత్‌రావు, కేఎన్‌ఆర్ కంపెనీ పీఎం కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొండపాకలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

- దుబ్బాక: మహిళల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయస్థాయి మూడో కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్‌లో గాయంత్రి వివేకానందా విద్యార్థులు తలారి నిశాల్, మనశ్వీత్‌లు రెండు బంగారు పతకాలు సాధించడంతో వారిని శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బూరనిశ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన బైక్‌లు

సిద్దిపేట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ కోంపెల్లి సాగర్, దుబ్బాకకు చెందిన శ్రీకాంత్ బైక్‌పై సిద్దిపేట నుంచి దుబ్బాకకు వెళ్తుండగా, అదే సమయంలో దుబ్బాక మండలం మీరాపూర్ గ్రామానికి చెందిన శ్రావణ్ బైక్‌పై సిద్దిపేటకు వస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన సాగర్ అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. శ్రావణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సాగర్ మృతిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అమ్మో..వానరాలు

ఐదో పేజీ తరువాయి

కోతులు రాకుండా ఉండేందుకు ఉదయం, రాత్రుళ్లు చప్పుళ్లు చేస్తూ, బాణసంచా కాల్చుతూ పంట రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఉదయం కోతులు, రాత్రుళ్లు అడవి పందులతో కష్టాలు తప్పడం లేదు.

చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

జిల్లావ్యాప్తంగా కోతులను తిరిగి అడవుల్లోకి పంపేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు, ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో కోతులను పట్టేవాళ్లను పిలిచి వాటిని బోనులో బంధించి అడవుల్లో వదిలేసేవారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుని రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.